Science Serial Based on Sustainable Development .......Life Must Go On.........

Episode -23

# నీటి పరిరక్షణకు నూతన సూచనలు

**Research and Script. Srinivas Oli**

**Telugu Dr .chaganty Krishnakumari**

పాత్రలు:

1. రమణ: పరిశోధన విద్యార్థి (23-23 Years)
2. గోపాలం : రమణ మేనమామ (60 Years)
3. గీత : రమణ అత్తయ్య (55 Years)
4. రేఖ : పట్టణ విభాగ వికాశ అధికారి ( Block Development Officer) (30-35 Years)
5. రామయ్య: గ్రామీణుడు (About 55 Years)
6. సవిత: దానయ్య కూతురు కళాశాల విద్యార్థిని( 20 Years)
7. డా. సుధాకరం : నీటి నిర్వహణా నిపుణుడు ( 50-55 Years)

Signature Tune. Title Music with Announcement

ప్రకటన . ఈ రోజు రూపకంలో నీటి ఎద్దడిని ఎదుర్కొనడానికి నీటిని ఆదా చేసుకొనే సాంకేతిక పద్దతులగురించి తెలుసుకొందాం . రమణ తో కలసి మనం కూడా హిమాలయపర్వత శ్రేణిలో ని శివాలిక్ పర్వతాల దగ్గరున్న ఒక చిన్న పల్లేటూరికి వెళదాం

........................ Part of signature/title song continues ..........................

దృశ్యం:- సూర్యో దయం పక్షుల కిలకిలారావాలు, పిల్లగాలుల సవ్వడులు , కిటికీ తలుపులు తెరుచుకొన్న ధ్వనులు

రమణ:- మన గ్రామం ఈ సూర్యోదయ వేళ ఎంతందంగావుంది?మనసుకి హాయిగా ప్రశాంతంగా వుంది. చల్లని తాజా గాలి, పక్షుల మధురమైన కిలాకిలారావాలు. వింటున్నారా? ఇక్కడ అందాన్ని వర్ణించ డానికి మాటలు చాలవు .

………………… గోపాలం దగ్గరకి వస్తున్నట్టు పాదాల సవ్వడి ……………………………

గోపాలం:-రమణా ఇదే నగరాలకీ పల్లెలకీ ఉన్న తేడా

రమణ:- (నవ్వుతూ )మామయ్యా ! అప్పుడే లేచిపోయావే! రోజూ ఇలాగే సూర్యోదయానికి ముందే లేవడం నీ అలవాటా లేక ఇవాళే తొందరగా లేచావా?

గోపాలం:-రమణా!.. మేము వ్యవసాయదారులం.ఇక్కడున్న మా కుటుంబాలన్నీ వ్యవసాయంచేసుకొంటూ బతి కేవే! తెల్లారకముందే లేవకపోతే పొలంలో పనులెలా చేయగలుగుతాం? మేమెవరమూ నీలాగా పరిశోధనచేసే విద్యార్థులం కామే! మీ విశ్వవిద్యాలయంవారు నీకిచ్చిన వసతి లో నిన్న రాత్రి నువ్వు నిద్రించి వుంటే బహుషా , ఇంకా ఇప్పటికీ గాఢ నిద్రలోనేవుండి వుండే వాడవు! ఇక్కాడున్నావ్ కాబట్టే ఇంత తొందరగా లేచావ్! అంతేనా, ఏమంటావ్?

………………… గీత దగ్గరకి వస్తున్నట్టు పాదాల సవ్వడి ……………………………

గీత:- రమణని ఎందుకలా ! ఆట పట్టిస్తారు ?

గోపాలం:- … అలాంటిదేమీ లేదు, సరదాగా మాట్లాడుకొంటున్నాం , మామూలు మాటలే!

గీత:- సరే రమణా తొందరగాపళ్లుతోముకొని , స్నానం చేసి రా. వేడి వేడిగా ఇడ్లీ , తిందువుగాని , నీ కిష్టమైన కొబ్బరి పచ్చడి వుంది. సాంబారు కూడాచేసా.

రమణ:- అలాగే అత్తయ్యా! కానీ తర్వాత మనం ఎక్కడకైనా వెళుతున్నామా ? నాకిక్కడ ఏమిటి చూపిస్తారు?

గీత:- : - నిన్న నే అనుకొన్నాంగా మర్చిపోయావా రమణా! మనమందరం ‘ గరాత్’ ని చూడడానికి వెళ్తున్నాంగా.

రమణ:- ( ఆత్రంగా ) ఓ, అవును కదూ, ‘ గరాత్’ అంటే నీటితో నడిచే పిండి మిల్లు , పుస్తకాలలో చదవడమేకానీ వాస్తవంగా అదెలా పనిచేస్తుందో ఎప్పుడూ చూడలేదు. అత్తయ్యా! ఇప్పుడే, నిముషంలో తయ్యారై వచ్చేస్తా .

గీత:- తొందరగా స్నానం ముగించుకురా, గ్రామీణ వాతావరణలోని అందాన్ని చూస్తే నువ్వు ఆశ్చర్య పోతావ్ ! పొద్దు పొడుస్తున్న సమయంలో గ్రామం లో కాలినడక నీలంటి వాళ్లకొక అరుదైన అనుభవం.

……………………… వంటపాత్రలు కప్పులు సాసర్ల చప్పుళ్లు ………………………………

గోపాలం:-అవును గీతా, మన రమణకి ఇదొక మంచిఅవకాశం,ఇక్కడ జీవన విధానాలు తెలుసుకోవాలని వాడు ఆరాట పడుతున్నాడు .

………………నడుస్తున్న పాదాల చప్పుళ్లు, దగ్గరవుతూ……

రమణ:- సంతోషంగా) మామయ్యా, నీటి పిండిమిల్లు చూడాలని వుంది. చాలాదూరం నడవాలేమో, తిరిగి ఇంటి కొచ్చేసరికి బాగా ఆలశ్యం అవుతుందన్నారు కూడా కదా ? భోజనం లేకుండా సాయంకాలం దాకా వుండగలనా , నడవగలనా, అని భయంగా వుంది.

గోపాలం:-ఆ భయం నీకక్కరలేదు . భోజనాల వేళకు ఇంటికొచ్చేద్దాం . మీ అత్తయ్య, మనకోసం వండి సిద్ధంగా వుంచుతుంది.

గీత:- :- గారత్ దగ్గరే ఎక్కువ సేపు వుండి పోకండి. సమయం చూసుకొంటూవుండండి . భోజనం వేళకు తిరిగొచ్చేయండి. మీరు వచ్చాక అందరం కలసి భోంచేద్దాం , ఎదురుచూస్తూవుంటా.

**..................... సంగీతం...........................**

**.................... నడుస్తున్న పాదాలచప్పుళ్లు. పిట్టల కూతలు .......................**

రమణ:- అమ్మో! నేనింక నడవలేనుబాబోయ్, మామయ్యా? ఇంకా ఎంత దూరం వెళ్లాలి?

గోపాలం:-(నవ్వుతూ )... దగ్గరకొచ్చేసాం.నేను ఇక్కడ పాఠ శాలలో చదువుకొంటున్నప్పుడు రోజుకి ఇటూఅటూ మొత్తం నాలుగుసార్లు నడిచేవాణ్ణి. అదిగో నది కనిపిస్తోందా?అక్కడే దానిపక్కనే అటువైపుకి పిండి మిల్లులు న్నాయ్.

రమణ:- అవునవును, కనిపిస్తున్నాయ్.

గోపాలం:- జాగ్రత్త!నిన్నరాత్రి వానపడిందికదూ, ఇక్కడ కాస్త బురదా వుంది, కాలు జారుతుంది ,జాగ్రత్తగా అడు గేయి.

**.........................................నడుస్తున్న పాదాల చప్పుడు నదిలో నీటి ప్రవాహపు చప్పుడు**

రామయ్య :-(దూరంనుండి ) నమస్కారం గోపాలం అన్నా! చాలారోజులకిటువైపుకొచ్చావే!

గోపాలం:-నమస్కారం రామయ్య ! ఎలావున్నావ్ ? ఆ ప్రక్కనున్న గ్రామాలలో పిడి మిల్లులున్నాయికానీ అవన్నీ డీజిల్ తో నడుస్తాయి. మామేనల్లుడు గారత్ ని చూడాలని ఆరాటపడుతున్నాడు.రమణా, ఇతను రామయ్య, నాలాగే వ్యవసాయదారుడు

రమణ:- నమస్కారం రామయ్య మామా !

రామయ్య:- నమస్కారం బాబూ!

రమణ:- వీటిని నేను లోపలనుంచి చూడవచ్చునా?

రామయ్య:- దానికేముంది? తప్పకుండా చూడవచ్చు. రండి చూద్దురుగాని.

………………నడుస్తున్న  పాదాల చప్పుడు/ నీటి మిల్లు, నదీ ప్రవాహపు చప్పుళ్లు …………

గోపాలం:- ఈ నదుల లో నీరు తగ్గుతున్నది కదా రామయ్యా? కిందటేడు దాదాపుగా ఎండిపోయిందన్నారే!

రామయ్య:- అవును గోపాలం అన్నా. రానురాను తగ్గుతున్నాది.ఈనీటిని నగరాలకు గొట్టాలద్వారా మళ్లిస్తున్నారు, ఇక్కడ నీటి తగ్గుదలకి అది కూడా ఒక ప్రధాన కారణం .

రమణ:- (ఆశ్చర్యంగా ) మామయ్యా! , మనపూర్వీకులు గొప్ప ఆవిష్కర్తలు  వాళ్లకు విద్యుత్ అవసరమే లేదు. కాలుష్యపు బెడద వారెరుగరు. కానీ , ఇక్కడ జనసంచారం అంతగా వున్నట్టులేదే !

రామయ్య:-  ఇక్కడకు వచ్చి ఎంచేయగలరు? ఇరవై కిలోల గోధుమలు ఆడడానికి చాలా సమయం పడుతుంది. జనాలు డీజిల్ తో నడిచే పిండి మిల్లులకు ఎగబడుతున్నారు. అదీ కాక ఇక్కడి నీటి మట్టం మిల్లు అడడానికి సరిపడినంతగా వుండటం లేదు.

రమణ:- డీజిల్ తో నడిచే పిండి మిల్లులు లేని కాలంలో వారు వాటిని ఎలా నడుపుకోగలిగే వారు?

రామయ్య:-అప్పటిపరిస్థితులు వేరు.నదిఎంత వుధృతంగా పారేదంటే మేము దానిని దాటలేకపోయేవారం.

గోపాలం:- రామయ్యా! అప్పుడిక్కడ పది మిల్లులుండేవి కదూ?

రామయ్య:- అవునన్నా! అవిగో, వాటి అవశేషాలు మనకిక్కడ కనిపిస్తూనే వున్నాయిగా !

రమణ:- అబ్బా! పది నీటి మిల్లులే! పది మిల్లులు నీటితో నడిచేవా? నమ్మలేకపోతున్నాను.

రామయ్య:-ఆరోజులలో నదులు, వాటి ఉపనదులు నిండుగాప్రవహిస్తూ వుండేవి. పిండిమిల్లులు నడుపుకోవడానికి సరిపడినంతగా నీరుండేది. నదులలో నీరు రోజురోజుకీ తగ్గిపోతూండడంతో నీటిమిల్లుల సంఖ్యా తగ్గుతూ వుంది.

గోపాలం:-వానాకాలం లోనే ఇక్కడ పిండిమిల్లులు పని చేస్తాయిగా, నడుస్తున్న మిల్లుని చూపించాలనే నా మేనల్లుడిని ఇప్పుడుతీసికొచ్చా .

రామయ్య:- నిజమే, ఈ కాలంలో తప్ప మిగిలినకాలలలో ఇక్కడ మిల్లు పనిచేయదు.అందుకు సరిపడ్డా నదిలో నీరుండదుగా !

రమణ:- మామయ్యా? ఎందుకిక్కడ నదులలో రాను రానూ నీరు తగ్గి పోతోంది?

రామయ్య:- చూస్తున్నావా దూరంగా ఆ కొండలని ? ఒక్కచెట్టు కనిపిస్తున్నాదా కొండలమీద? అదివరకటి రోజులలో ఈ కొండలన్నీ దట్టమైన అడవులతో కప్పబడి వుండేవి . చాలా పెద్దపెద్ద వృక్షాలుండేవి . ఇప్పుడక్కడక్కడా దేవదారు చెట్లు తప్ప మరేవీ కనిపించవు.

రమణ:- అవును, కొండలన్నీ బోడిగుండుల్లా వున్నాయి. ?

గోపాలం: ఆ కొండలమీద అడవి చెట్లుంటేనే ఇక్కడున్న చిన్న చిన్న నదులకి కడుపారా నీరందుతుంది. చెట్లు చాలా భాగం వాన నీటిని నిలవచేయగలవు ,ఈ నీరు ఏడాది పొడవునా నేలలోపలి చిన్నచిన్న కన్నాలనుండి నెమ్మది నెమ్మదిగా కిందకు దిగుతూ వుంటుంది. దీనిని అంతస్రవణమంటారు. ఎక్కడైతే అడవులు ఆరోగ్యంగా అలరారుతూ వుంటాయో అక్కడ జలవనరుకి ఇబ్బంది వుండడక పోవడాన్ని మనం గురించ వచ్చు .

రమణ : - అంటే దానర్థం అడవుల నరికివేత తెచ్చిపెట్టిన అనర్ధ మన్నమాట ఇది ! చక్కగా పరిసరాలను కలుషితం చేయకుండా గ్రామీణులు గారత్ లో గోధుంపిండాడుకొనేవారు కదా!

గోపాలం:-. అడవుల నరికివేతల వల్లే ఈ విధమైన కాలుష్య రహిత సాంకేతిక పద్దతులు కనుమరుగైపోతున్నాయి !

రామయ్య:- అందుకే కదా చాలా మటుక్కి గారత్ లు అన్నీ ఇక్కడ మూత పడ్డాయి! అదివరలో నీటిని సరఫరా చేసే గొట్టాలు ఇక్కడుండేవి కావు. కాలవలు గ్రామీణులందరి నీటి అవసరాలను తీర్చేవి. తమ అవసరాలకు సరిపడినంత నీరు దొరకాలంటె అటవీసంపదను కాపాడుకోవాలని మన పూర్వీకులకు తెలుసును. ఇప్పుడు మనందరికీ నీరుకావాలి, కానీ , అడవులను పరిరక్షించుకోవాలనే ఇంగిత జ్ఞానం మనలో ఎవరికీలేదు.నీటిని ఆదా చేసుకోవాలనే ధ్యాస మనకెవరికీ లేదు. .

గోపాలం:- అనట్టు రేపు పంచాయితి భవనంలో నీటివనరుల సంరక్షణపై సదస్సు వుంది. గుర్తుందా రామయ్యా !

రామయ్య:- అవునవును గోపాలం అన్నా! ఆసదస్సుకి రేఖ గారు, తెలుసుగా మన బిడిఓ గారు వస్తున్నారు.

రమణ:- బిడిఓ అంటే Block Development Officer కదా మామయ్యా!

గోపాలం: అవును రమణా! రేఖ గారు మన పుర విభాగ వికాశ అధికారిణి . చాలా మంచి సామర్ధ్యంగల అధికారిణి. నువ్వు గారత్ పనిచేసే విధానాన్ని సరిగ్గా చూసి తెలుసుకొన్నావనుకొంటా. ఇంక బయలుదేరుదామా

రమణ:- బయలుదేరుదాం నాకాకలి దంచేస్తోంది. అత్తయ్య ఆలశ్యం అయితే నన్నేమీ అనదు, నీకే చీవాట్లు పెడుతుంది.(నవ్వుతూ)

గోపాలం:- రామయ్యా! రేపు పంచాయితీ భవనం దగ్గర కలుద్దాం , మీ అమ్మాయి సవితను కూడా తీసుకొనిరా. సవిత నీటి సంరక్షణ విషయంలో చాలా సునిశితంగా ఆలోచిస్తూ నీటిని పొదుపుగావాడుకోవాలని చెపుతూ వుటుంది. , నీరు వృధాగా పోతూ వుంటే ఆపిల్ల చూసి తట్టు కోలేదు. .

రామయ్య:- సరే గోపాలం అన్నా! రేపు నేనూ సవితా కలిసి వస్తాం

**...................... నీటి మిల్లు, నదీ ప్రవాహపు చప్పుళ్లు క్రమ క్రమంగా తగ్గుతూ ఆగిపోతాయి.................**

**................ దృశ్యం :-- పంచాయితీ భవనం. సదస్సు వాతావరణం ...................**

**.................... మైక్ సరిచేస్తున్న చపుళ్లు, ఆహుతుల సందడిని తెలియచేసే చప్పుళ్లు .......**

గోపాలం:- అందరూ సర్దుకొని నిశబ్ధం గా కూర్చోం డి

........................................... . నిశబ్దం ...................................

గోపాలం:- మిత్రులారా! పంచాయితీ భవనం లో జరుగుతున్న ఈ సభకి ఆహ్వానం. మన బి.డి.వొ. శ్రీమతి రేఖ గారు మన పుర విభాగాన్ని అన్ని విధాలా వెలుగొందేలా చేయడానికి ఎంతగానో కృషి చేస్తున్నారు. మన గ్రామ ప్రజల తరఫున వారిని వేదికమీదకు సాదరంగా ఆహ్వానిస్తున్నాను. ఆహుతులతో సభ నిం డుగావుంది. శ్రద్దగా , ఆసక్తిగా ఇక్కడకు వచ్చిన మీ అందరికి మరొక్కసారి ఆహ్వానం.

......................... తప్పట్లు ....................

రేఖ:- - గోపాలంగారికి, సభాసదులకు నమస్కారం . నీటి సంరక్షణ విషయమై మీతో సంభాషించడానికి మిమ్మల్ని అందరినీ ఇక్కడకు ఆహ్వానించాము. అందువల్ల నేను ఉపన్యసించడం , మీరు వింటూ కూర్చోవడం ఈ సభ ఉద్దేశ్యంకాదు ఏమంటారు గోపాలంగారూ, అంతేనా?

గోపాలం:- మిత్రులారా , మన బి.డి.వొ. శ్రీమతి రేఖ గారు చాలా సహృదయులు. మనకి సహకారాన్ని అందించడానికి వచ్చారు. గతంలో కూడా చాలా అభివృద్ధి కార్యక్రమాలలో మనకు వారి అమూల్య దిశానిర్దేశంతో సహకరించారు.కాబట్టి వారితో ఏ సంకోచం లేంకుడా మీమీ సందేహాలను తీర్చుకోవచ్చు.

......................... తప్పట్లు ....................

రేఖ:- అత్యంత ప్రాముఖ్యత గల ఈ విషయంపై మీతో చర్చించడానికి నన్ను ఆహ్వానించినందుకు చాలా సంతోషంగావుంది. దాదాపుగా మన విభాగంలోని అన్ని గ్రామాల నుండి గ్రామీణులు ఈ సభలో పాల్గొనడానికి తరలి

వచ్చినట్టు తెలుస్తున్నది. మీ అందరికీ నాకృతజ్ఞతలు . డాక్టర్ సుధాకరం గారు కూడా వచ్చారు. వారు నీటి పరిరక్షణ, నిర్వహణ ల విషయంలో నిష్ణాతులు. సుధాకరంగారిని వేదిక మీదకు ఆహ్వానిస్తున్నాను. వారు ఈ నాటి చర్చా కార్యక్రమంలో మీతో సహకరిస్తారు

.( .............................. కుర్చీలో కూర్చుటున్న చప్పుళ్లు.................................... )

.......................... తప్పట్లు .....................

రేఖ:- మీరు నీటి పరిరక్షణ , నిర్వహణల గురించి చర్చ మొదలు పెట్టవలసినదిగా Dr. సుధాకరం గారిని కోరుతున్నాను.

.......................... తప్పట్లు .....................

Dr. సుధాకరం: - వేదిక మీదనున్న రేఖగారికి, గోపాలంగారికి, సభా సరస్వ తికి వందనాలు. ఈ సభ మీకోసం ఏర్పాటు చేసాం. సాగునీటిని ఎలా పొందాలి, నీటిని ఎలా పరిరక్షించుకోవాలి, మురుగు నీటిని ఎలాశుద్ధి చేసుకోవాలి వంటి ఏ విషయాన్నైనా సందేహించకుం డా మీరు అడిగి తెలుసుకోవచ్చు.

రేఖ: రామయ్యా? నువ్వు నీ సమస్య గురించి అడుగుదామనుకొన్నావని గోపాలంగారు చెప్పారు. ?

రామయ్య:- అవును రేఖమ్మగారూ, మా పంట కాలవలలో నీరు రోజురోజుకీ తగ్గిపోతున్నాది. నీటి మిల్లును నడుపుకోడానికి నీరు చాలటంలేదు. మాకిది చాలా పెద్దసమస్య . దీనికేదైనా మార్గం చెపుతారా?

రేఖ:- చూడండి , అంతా మనమీదే అధారపడి వుంది. మనంగాని సరియైన నిర్ణయాలుతీసుకొని, వాటిని అమలులోపెడితే , పరిస్థితులు మెరుగుపడతాయి. మీఅందరికీ అడవుల ప్రాముఖ్యత తెలుసు. ప్రాధమిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని అందుకనుగుణంగా ప్రవర్తిస్తే సమస్య మబ్బు విడినట్టు విడిపోతుంది.

రామయ్య:- ఈ సంవత్సరం మేము కొండ మీదా చాలా చెట్లు నాటాం , కానీ ఫలితంఏమీ కనిపించలేదు.

సుధాకరం:- విచారించకు. మీ శ్రమ వృధాగాపోదు. పరిస్థితులు మెరుగై ఆయా ప్రదేశాల మొత్తం రూపురేఖలే మారిపోయిన దాఖలాలు మనదేశంలో చాలానే వున్నాయి. .

రామయ్య:- మీరేమన్నారో నాకు బోధ పడలేదండి.

సుధాకరం: - రాజేంద్ర సింగ్ పేరు విన్నారా? అతనిని జలపురుషుడు- నీటి మనిషి - 'Water Man'. అంటారు.

రామయ్య:- - రాజేంద్ర సింగ్ గారికి మా సమస్యతో ఏమిటి సంబధం?

సుధాకరం:- నీటి పరి రక్షణలో అతని కృషి ని మనదేశంలోనే కాదు, ప్రపంచదేశాలన్నీ గుర్తించి మెచ్చుకొన్నాయి. .

1980లో అతను రాజస్తాన్ లో సాగునీటిపై సమస్యపై స్వయంగా పని మొదలుపెట్టాడు.

రామయ్య:- ఎడారి ప్రదేశంగా అది, అక్కడేంచేసాడాయన?

సుధాకరం:మన పూర్వీకులు శతాబ్దాల తరబడీ అమలుచేసుకొన్న నీటి నిర్వహణాపద్దతులను మనం తిరిగి ప్రవేశపెట్టుకోవాలని అతను నొక్కివక్కాణించి చెపుతాడు. నీటి పరిరక్షణకై గ్రామ ప్రజల సహకారంతో అతను చిన్న చిన్న ఆనకట్టలను కట్టాడు. వాన నీరు ఈ ఆనకట్టలలో చేరి నిలవవుండగా కొద్ది సంవత్సరాలకే భూగర్భ జలాల మట్టం పైకిరావడం మొదలైంది.

సవిత:- కానీ , ఎడారిలో ఆనకట్టలు కట్టడం ఎలా సాధ్యమైందో నాకు అంతుపట్టడం లేదు.

సుధాకరం:- నువ్వలాఅనుకోవడం సహజమే ! నీలాగే చాలామంది భావించారు. అతనిని ఉద్దేశిస్తూ వెటకారాలాడారు. కానీ అతని శ్రమ ఫలించింది. నీటి సమస్య వల్ల అక్కడి ప్రజ గ్రామాలను విడిచి వేళుతుండేవారు. ఇప్పుడు నీటి సమస్య తీరగానే మళ్ళీ వారి వారి గ్రామాలలో సేద్యపు పనులు మొదలు పెట్టారు.

రేఖ: ఆ ఫలితాలను చూసిన చాలా మంది అతనితో చేతులు కలిపారు,ముందు కొచ్చి తమ మద్దత్తు ను అందించారు. వేల కొద్ది చెరువులు, చిన్నచిన్న అన్నకట్టలు బంజరు భూములలొ నిర్మాణమై అందుబాటులోకొచ్చాయి.

సుధాకరం:- వాన నీరు ఆచెరువులలో చేరి నిలవవుం టూ , నెమ్మది నెమ్మదిగా భూమిలోకి ఇంకడంతో భూగర్భ జలాల మట్టం పెరిగింది.

రామయ్య:- ఇలాంటి సంప్రదాయ పద్దతే మా ఉతరాఖండ్ గ్రామాలలో కూడా వుండేది. దానిని ఛాల్ - ఖాల్ ("Chal-Khal") అంటారు.కానీ ఇప్పుడెవరూ దానిని పట్టించుకోవటంలేదు. .

సుధాకరం:- సరిగ్గా చెప్పావు రామయ్యా. నిజానికి రాజేంద్ర సింగ్ కొత్తగా, కనుగొన్నదీ, చేసింది ఏమీ లేదు. ప్రవహిస్తూ వృధాగా పోతున్న వాననీ టిని చెరువులను తవ్వుకొని నిలవ చేసుకోవడం ఎందుకో చెపుతూ జనాలను ఒప్పించాడు . అదే మంచి ఫలితాలనిచ్చింది.

రేఖ:- దాంతో రైతులు సేద్యం బాగా చేసుకోగలిగారు. పొలాలు మంచి ఫలసాయాన్నిచ్చాయి. నీరు అందరికీ అందుబాటులోవుంది. ఇప్పుడక్కడ ప్రదేశాలు పచ్చదనంతో కన్నులపండుగ చేస్తున్నాయి.

రామయ్య:- ( సంతోషంగా ) ఓ, అయితే రాజస్థాన ప్రజలకి రాజేంద్రసింగ్ భగవంతుని తో సమానమేనే! .

సుధాకరం:- రాజస్థానంలో మాత్రమేకాదు. మన దేశంలో ఇతర ప్రాంతాల వారు కూడా అతని పద్ధతులను అవలంబిస్తున్నారు. నీటిని వారు చెరువులలోనూ ఆనకట్టలలోనూ నిలవచేసుకొంటున్నారు. అందుకే అతనిని జల పురుషుడంటూ సముచితమైన రీతిలో కీర్తిస్తున్నారు.

రామయ్య:- మన నదులను నీటితో నింపే ఓ జల పురుషుణ్ణిచ్చి భగవంతుడు మనలను కూడా కాపాడాలి.

రమణ:- రామయ్య మామా! మనకోసం ఎవరూ ఆకాశంనుంచి దిగిరారు. మనలను మనమే కాపాడుకోవాలి. సరియైన విధానాలను అమలుపరచుకొంటూ పోతే ఒకనాడు మన నీటి సమస్య తీరుతుంది. త్రాగు నీటిని డబ్బాలలో సరఫరాచేయడానికి మన గ్రామానికి రైలు, బస్ మార్గాలు కూడా లేవు . తాగు నీరుకూడా కరువయ్యే పర్స్థితి రాకుండానే మనం వాననీటిని నిలవ చేయడం మొదలు పెట్టాలి. .

సవిత:- - నువ్వనేదేమిటి? వాన నీరు తాగాలంటావా? .

సుధాకరం:- సవితా! రమణ పరిస్థితిని బాగా అర్ధంచేసుకొన్నాడు . అతను చెప్పింది రైటే! కిందటేడు మహారాష్ట్రాలో ఒక దగ్గర నీటి ఎద్దడికి ఎంతగా జనాలు బాధపడ్డారంటే ప్రభుత్వం రైలు భోగీలలో వారికి నీటిని సరఫరా చేసారు.

రేఖ:- - మహారాష్ట్రాలోని కొన్ని ప్రాంతాలలో కొంతమంది స్థానిక సమస్యల పరిష్కారానికై సామాజిక సేవ చేస్తున్నారు . వాటిలో నీటి నిర్వహణ కూడా ఒక ప్రధానఅంశం. వారి దగ్గరనుండి మనం నేర్చుకోవచ్చు

గోపాలం:- రేఖ గారూ! మహారాష్ట్రా లోని సామాజిక సేవకులు చేసిన కృషి ప్రత్యేకత ఏమిటి?

రేఖ:- -' జల పంచాయితి' - 'Water Panchayat' - గురించి నేను చెపుతున్నాను.

గీత:- :-( ఆశ్చర్యంతో ) మేము గ్రామ పంచాయితి గురించి విన్నాం . ఈ జల పంచాయితి ఏమిటి?

రేఖ:- - ఇది కూడా ఒక వ్యక్తి ప్రదర్శించిన అద్వితీయ చొరవ. అతని పేరు విలాస్ రావ్ సంకులె స్థానిక గ్రామ ప్రజలకు న్యాయ పరమైన నీటి నిర్వహణకు ప్రేరేపించాడు. 1972 లో మహారాష్ట్రా లో చాలా ప్రాంతాలు తీవ్రమైన కరువును చవి చూసాయి. ఎంత తీవ్రగా అంటే కొన్ని వేల మంది ఆకలితో అలమటించిపోయారు. ప్రజానీకమంతా ఏకమై వచ్చినప్పుడే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని విలాస్ రావ్ సంకులె అప్పుడు భావించాడు.

సవిత:- - మహారాష్ట్రా లో జనాలు ఏంచేసారు?

రేఖ:- - విలాస్ రావ్ తన ప్రచారాన్ని పూనా జిల్లా లోని పురందర్ తాలూకా లో నయాగావ్ నుండి మొదలుపెట్టాడు. స్థానిక గ్రామ ప్రజలను తన ప్రచారంలో భాగస్వాములను చేసాడు. ఆప్రాతంలో గ్రామీణుల

సహాయంతో చిన్న చిన్న  ఆనకట్టలు  కట్టే డు.కొండ దిగువు భాగంలో  ఒక పెద్ద జలాశయాన్ని  నిర్మించాడు. కొండలదారుల వెంట పండ్లచెట్లను,   బంజరు నేల పై  చిన్న చిన్న పొదలు,గడ్డిని నాటాడు .

సవిత:-   - ఊ, నాటితే -  ఏమైంది ?

రామయ్య:-   ఓ మహాద్భుతం జరిగి వుండాలే!  అక్కడి భూగర్భజలాలు పెరిగి వుంటాయి, బంజరు భూములు పచ్చగా మారిపోయాయనుకొంటా.

రేఖ:-  - (  నవ్వుతూ ) సరిగ్గానే ఊహించావ్ !  ఎండిపోయిన నేల మీదకు  నీరొచ్చి చేరుతూ వుంటే, అది మంచి పంటపొలంగా  మారడంలొ వింతేముంది?  గ్రామాన్ని  విడిచి  వెళ్లిన రైతులందరూ  తిరిగి గ్రామానికొచ్చి వ్యవసాయాన్ని  చేసుకోడం మొదలెట్టారు.

సవిత:-   - అద్భుతం !  మంచి  చొరవతో, సరికొత్త ప్రయోగంతో  విలాసరావ్    పరిస్థితులను చక్కదిద్దాడు.

రేఖ:-  -  అక్కడతను సాధించిన  ఆ విజయంతో మహారాష్ట్రా లో ఇతర గ్రామాలలో  కొత్త  కార్యక్రమాలపై  కృషి చేసాడు. గ్రామాలలో నీటి  వనరులను ఏర్పరచాడు. ఈ  నీటివనరులనే   ‘ జలపంచాయితీల’ న్నాడు . ఈ పంచాయితీలకు  నీటి సరఫరా విషయమై  కొన్ని నియమ నిబంధనులున్నాయి.  ఈ వ్యవస్థ  ఒక ఇంట్లోనున్న  మనుషుల సంఖ్యను బట్టి నీటిని అందిస్తుంది , గ్రామంలో అందరికీ సరిసమానంగా నీరు దొరుకుతుంది.

సవిత:-   - విలాసర్ రావ్ సంకులే  గొప్ప వైజ్ఞానిక  దృక్ప థం  వున్న  వ్యక్తి

రేఖ:-  -   వృత్తిరీత్యా  అతనొక ఇంజనీరు. నీటి నిర్వహణలో అతనికున్న పరిజ్ఞాన్నాన్ని వాడుకొన్నాడు. రైతులను తక్కువ నీటి తో  పండే పంటలను  నాటుకోవడానికి  జలపంచాయితి ప్రో త్సహించింది.  సామాజిక  నీటి సరఫరా వ్యవస్థ రూపొందిన విధానం  ఇటు పెద్దరైతుల, అటు రైతు కూలీల నీటి అవసరాలను తీర్చగలిగింది.       .

సుధాకరం:- మరొక్క విషయం!  ఎప్పుడైతే  విలాసరవ్ గారి కృ షికి మంచి ఫలితాలొచ్చాయో  ప్రభుత్వం ముందుకొచ్చి ఆర్థిక సహాయాన్నిచ్చింది. అటువంటి మరిన్ని కర్యక్రమాలకు  ఆర్థిక సహాయాన్ని అందంచడం మొదలుపెట్టింది.దీంతో  నీటి నిర్వహణ ఊపందుకొని  మిగిలిన ప్రాం తాలకు కూడా వ్యాపించింది.

రేఖ:-   అంటే దాని అర్ధం ఏమిటి?  మనంకాని  సమాజిక స్థాయిలో ఏదైనా మంచి కార్యక్రమాన్ని చేపడితే ప్రభుత్వాలు కూడా  సహాయం చేయడానికి ముందు కొస్తాయి.

రామయ్య:-  అవును రేఖ గరూ, మా కాలవలలో నీరొచ్చి చేరడానికి ఏదైనా  చేపట్టగల కార్యక్రమం వుందా? , మా నీటిసమస్యతీరేలా, మేము మా పిండిమిల్లులు ఆగకుడా పనిచేస్తూ నడుపుగోగలిగేలా, వాటిని మూలనపడేవేసే దౌర్భాగ్యం     లేకుండా ఓ మత్రం వుంటే చెప్పండి

.......................................................... బిగ్గరగా నవ్వులు......................

రేఖ:-  - ( చిరు శబ్దపు చిరునవ్వుతో ) నదుల పరిరక్షణకి చాలా  కార్యక్రమాలే వున్నాయి. ప్రధానంగా  వాటికి నీరెక్కడనించి వచ్చి చేరుతుందో ఆ నీటి వనరులను  రక్షించుకోవాలి.

సుధాకరం:- నదుల ఉపయోగం కేవలం నీటికి మాత్రమే కాదు. మన సంస్కృతి సాంప్రదాయాలు నదులతో ముడి పడి వున్నాయి. గంగా నదినే తీసికోండి.  గంగానదీ పరివాహక ప్రంతాలలొ సుమారు 40 కోట్ల  జనభా నివసిస్తున్నారు. అంటె వీరందరివల్లా ఎంతగానో   చెత్త  చెదారం మురికి మొదలైన  వ్యర్ధ పదార్ధాలు  గంగలో చేరుతున్నాయి.  అలా గంగ నీరు కలుషితమవుతున్నాది.

రేఖ:-  -మీకు తెలుసునా? మన ప్రభుత్వం గంగను శుద్ది చేసి  తిరిగి  చేతన్య వంతం చేయడానికి  " నమామి గంగ' పేరుతో ఒక కార్యక్రమాన్ని  చేపట్టింది. దాని బడ్జెట్ కేటాయింపును నాలుగింతలు పెంచింది.2019-20 సంవత్సరాల నాటికి  సుమారు ఇరవై వేల  కోట్ల రూపాయలను  గంగ ను శుద్ధి  చేయడానికి  ఖర్చు పెట్టవలసి  వుంటుంది.

సుధాకరం:- ఇదే కాదు,  మురుగు నీటిని శుద్ధి  చేసే  కేంద్రాలను  కూడా  గంగ ఒడ్డున  ప్రభుత్వం నెలకొల్పుతున్నాది. ఆక్సీకరణ  ప్రక్రియ లో గంగాజలాలను  శుద్ధిచేయగా వాటిలో చేరిన   హానికరమైన  సూ క్ష్మ క్రిములు  నశిస్తాయి. ఏకకాలంలో దానితో పాటుగా  అక్కడి పరిశ్రమల,  గ్రామీణ వ్యర్ధాలను కూడ  శుద్ధిచేస్తూ  తగిన చర్యలు తీసుకోవడం కూడా జరుగుతుంది.

రేఖ:- ఈవిధంగా  నీటి కాలుష్యపు మూలలోకి వెళ్లి  వాటిని  అదుపుచేస్తూ , మన నదులనన్నింటినీ  శుద్ధి చేసుకొంటే   సమస్య  ఓకొలిక్కి వస్తుంది.  నగరాలనుండి, పరిశ్రమలనుండి  విడుదలవుతున్న  వ్యర్ధ జలాలను ముందుగా తగిన రీతిలో శుద్ధి చేసిన మీదటే  వాటిని  నదులలోకి వదలడంలో  మనం విజయంసాధిస్తే  సమస్య తీరిపోతుంది.  .

రేఖ:-   గంగా నదిలో  కలుస్తున్న  నదులున్నాయికదా. అందువల్ల  ఆయానదులలోని కాలుష్యాలను తొలగించి, ఆపై మరి ఇక చేరకుండా కూండా  చూసుకోగలిగిననా డే గంగనీటి ప్రశస్త్యాన్ని  కాపాడుకొనగలిగిన వారమవుతాం.

రామయ్య: - అంటే మన దేశలోని నదులనన్నిటినీ  శుద్ధిగా వుంచుకొంటె  ప్రధానమైన  మన సామాజిక సమస్యలన్నీ వాటంతటవే తీరిపోతాయ్.

రేఖ:-సరిగ్గా  చెప్పావ్ రామయ్యా.

సుధాకరం:- మరొక విషయమేమిటంటే  మనకున్న  నీటి వనరులను సరిగ్గా నిర్వహించుకోవడం.  నీరు ఎంత అవసరమో  నీటికి కరువు వచ్చాక అందరికీ బాగా తెలిసింది. నీరు మనకెంత అనివార్యమో  మనం ఎరిగి వున్నప్పుడు

దానిని పొదుపుగా వాడుకోవాలని వృధా చేయకోడదని మనసావాచా భావించినవారమవుతాం. అలా మసలుకొంటాం అప్పుడు నీటికి సమస్య ఎందుకుంటుంది .

రేఖ:- సరియైన నీటి నిర్వహణా పద్ధతులను అవలంబించడం, విచక్షణ తో నీటిని వాడుకోవడ మనే ఈరెండు అంశాలు ఒకదానితో ఒకటి ముడి పడి వున్నాయి. .

గీత : - నీరు మాకు చాలా తక్కువగా దొరుకుతున్నాది. దొరికినంత మేరకు మా నిత్యావసరాలకే మేము నీటిని వాడుకొటున్నాం . ఎలా అదా చేయగలం ?

సుధాకరం:- అలా కాదు. చిన్ని చిన్ని సంగతులను దృష్టి లో పెట్టుకొని వ్యవహరిస్తే ఆ స్వల్పమైన జాగ్రత్తలే నీటి పరిరక్షణ లో పెద్ద భూమికను పోషిస్తాయి .

రేఖ:- -అదెలాగంటే మనం మన ఇంట్లోనే నీటి పరిరక్షణకు మనవంతు భూమికను మనం నిర్వర్తించగలం . ఉదయం పళ్లు తోముకొంటున్నప్పుడు నీటి పంపు ను కట్టేసి నీరు అవసరమైనప్పుడే తెరవడం, అలాగే వంటపాత్రలను తోమేటప్పుడు, బట్టలుతుక్కొనేటప్పుడు. మన వంటింటినుడి బయటకి పోతున్న నీటిని కూరగాయ మొక్కల పెంపకానికి వాడుకోవడం మొదలైన అనేక సందర్భాలలో మనం నీటిని ఎంత పొదుపుగావాడుతున్నామో కనిపెట్టి మన అలవాట్లను సరిదిద్దుకోవచ్చు.

గోపాలం :- నీటిని చక్రీయ పద్ధతిలో వాడుకోవాలన్న ఇంగిత జ్ఞా నం ప్రతీ ఒక్కరికీ వుండాలి

సుధాకరం:- హిమాలయా పర్వత ప్రజలు వారి నీటి అవసరాలకి చిన్న నదులమీద ఆధారపడుతున్నారు, కానీ సమతల భూములలో తాగునీటికీ, వ్యవసాయానికీ భూగర్భజలమే ప్రధాన నీటి వనరు. అందువల్ల దానిని కాపాడుకోవలసిన అవసరంవుంది.

రేఖ:- - భూగర్భజలాలను పర్య వేక్షించే యంత్రాంగం Underground Water Board. వారి 2005 లెక్కల ప్రకారం 1951 తో పోల్చి2001 లో చూసినపుడు 35 శాతం నీరు తగ్గిపోయింది . 2025 నాటికి మరో పది శాతం తగ్గిపోతుందని అంచనాలు చెపుతున్నాయి. ఈ లెఖ్ఖని భవిష్యత్తులో చాలా భయంకరమైన గడ్డు పరిస్థితులను చూడవలసివస్తుంది

సుధాకరం:- ఇప్పుడు చూడపోతే మన గ్రామీణ పట్టణప్రాంతాలలో అదివరకున్న చాలా చెరువులు , జలాశయాలు మాయమయిపోయాయ్ . అడవుల శాతం కూడా రోజురోజుకీ తగ్గిపోతోంది. అందుకే నీటికోసం మనకిన్ని తిప్పలు .

సుధాకరం:- మన నివాసాల దగ్గర జలాయశాయాల ను నిర్మించు కోవడంద్వారా ఈసమస్యను కొంత వరకు అధిగమించ వచ్చు . నిజాన్ని చిత్తశుద్ధితో ఒప్పుకోగలిగితే ఈ పరిస్థితిని ఎదుర్కోవడం అంత కష్టమైన పని ఏమీ కాదు. ఈ నేల మీద బతుకుతున్న మనందరికీ నీరు జీవనాధారం అని గుర్తెరిగినవారమై , జీవనవిధానాలను మార్చుకోగలిగితే అభివృద్ధి పథాన పయనిస్తూ , ఆరోగ్య ప్రదమైన పరిసరాల లో జీవించగలుగుతాం.

రేఖ:- - ప్రపంచ జనభాలో 18శాతం జనాభా మన భారత దేశంలో వుంది. కానీ మన నీటి వనరులు ప్రపంచ నీటి వనరులలో 4శాతం వున్నాయి.ప్రస్తుత స్థితిని మనం ఇలాగే కొనసాగిస్తూ పోతే తొందరలోనే అత్యంత విషమ పరిస్థితికి దారితీసిన వారమవుతాం . నీటి చుక్కలు అంటె అక్షరాలా నీటి చుక్కలకోసం జనాలు పోట్లాడుకోవలసి వస్తుంది. WHO వారి నివేదిక ప్రకారం తొమ్మిది కోట్ల మంది జనాలకి, పరిశుద్ధమైన తాగునీరు అందుబాటులో లేదు. గ్రామాలలో పరిస్థితి ఇంకా ఎక్కువ దారుణంగావుంది

గోపాలం:- అంటే మన గ్రామీణ ప్రజలు నీటిని కొనుక్కోవలసి వుటుంది. ఒకానొక రోజున ఇతర దేశాలనుండి నీటిని కూడా కొనుక్కోవలసి రావచ్చునేమో కూడా .

......................................................... బిగ్గరగా నవ్వులు...........................

రేఖ:- - గోపాలంగారూ , మీరన్నదానిలో చాలా వాస్తవం లేకపోలేదు. పరిస్థితిని తక్కువగా అంచనావేసుకోకండి. సమస్య ఎంత తీవ్రతరమవుతున్నదో మీకు వివరించాం. మీ అందరికీ అర్థమైందనుకొంటాను.

సవిత:- అవును, నీరు లేక పోబట్టేకదా మాతాతయ్య నీటి మిల్లు పనిచేయటంలేదు. దాని మీద పెట్టిన మదుపంతా నీళ్ల పాలైంది.( నవ్వుతూ) అంటే నష్టం వచ్చిందని ,మిల్లుకోసం పెడుతున్న డబ్బు కూడా వృధా అవుతోది , మిల్లు మూసేసి, గ్రామాన్ని వదిలివెళ్ళిపోవాలి , వేరే గత్యంతరంలేదు.

రేఖ: వేరే గత్యంతరం లేదంటే ఎలా? నువ్వందుకు ఏంచేయాలనుకొంటున్నవ్? అది చెప్పు.

సవిత : ఇప్పుడే ప్రతిజ్ఞ తీసికొం టున్నా. మాప్రాంతంలో నీటిని పరిరక్షనకి నావంతు కృషి చేస్తా ఒక్క బొట్టు నీటి ని కూడా వృ ధాగా పోనివ్వను

గీత , గోపాలం:- ( ఉత్తేజంగా ) సవితా! మేమూ నీతోనే వున్నాం. ఇది మనందరి బాధ్యత. మన గ్రామాలను మనమే కాపాడుకోవాలి . బాధ్యతలనుండి మనం ఎన్నటికీ తప్పించుకోకోడదు. .

రామయ్య, మిగిలిన సభా సదుల గొంతుకలు: - అవును, మేమందరం ఈ మంచి పనికి మావంతు మేమూ చేస్తాం . మీతో చేతులు కలుపుతాం అందరం కలసి ప్రతిజ్ఞ చేస్తున్నాం మేము మాట ఇస్తున్నాం . జై జల పంచాయత్ , జై జై జల పంచాయత్

................................. ముగింపు --- సంగీతం తో ...............................

ప్రశ్నలు:

1. గంగానదిని శిద్ధి చేసి, చైతన్యవంతం చేయడానికై ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంపేరేమిటి?

సమాధానం : - నమామి గంగే

2. జల పంచాయిత్ అంటే ఏమిటి? దీనిని కల్పించిన వారెవరు?

సమాధానం : - గ్రామీణ ప్రజల సామూహిక క్షే మాన్ని కోరుతూ స్థానిక నీటి వనరుల నిర్వహణ ను జల పంచాయత్ అంటారు. దీనిని మహారాష్ట్రలోని తన స్వగ్రామమైన నయగావ్ నుండి శ్రీ విలాస్ రావ్ పూలే మొదలుపెట్టారు.

************************************************************************